జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి
- పిచ్చుకల దినోత్సవ కార్యక్రమానికి హాజరు

వీణవంక: పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రహర్ష తయారు చేసిన పిచ్చుక గూడును పరిశీలిస్తున్న కలెక్టర్

కమాన్‌చౌరస్తా, మార్చి 18 : నేడు జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం కాపాడడంలో పిచ్చుకల పాత్ర గొప్పదని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం ఉదయం జరిగిన పిచ్చుకల దినోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన పోస్టర్లను చూసి కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. పిచ్చుకల సంరక్షణ, తదితర అంశాలపై చిత్రలేఖనం, పోస్టర్ మేకింగ్, పిచ్చుక గూడు నిర్మాణానికి సంబంధించి నిర్వహించిన సృజనాత్మక పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి, సెక్టోరల్ అధికారులు కర్ర అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, గాజుల రవీందర్, కేఎస్ అనంతాచార్య, వంతడ్పుల ఆంజనేయులు, డాక్టర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టరేట్, మార్చి 18 : ప్రభుత్వం అందజేస్తున్న శిక్షణ తరగతులను ఉద్యోగులు సద్వినియోగం చేసుకుని, తద్వారా నైపుణ్యాభివృద్ధి దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం పరిధిలోని ప్రాంతీయ శిక్షణ కేంద్రాన్ని ఆధునీకరించగా, మంగళవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉద్యోగులకు రోజువారీ కార్యకలాపాల్లో ఉపయోగపడే ఆధునిక అంశాలను శిక్షణలో చేర్చాలన్నారు. కరీంనగర్‌లోని శిక్షణ కేంద్రానికి పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల నుంచి కూడా ఉద్యోగులు శిక్షణకు హాజరవుతున్న నేపథ్యంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ గురించి వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, యూత్ కోఆర్డినేటర్ రాంబాబు, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీబీపై అప్రమత్తంగా ఉండాలి

విద్యానగర్, మార్చి 18: టీబీ వ్యాధిపై అందరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానం ఉన్న వారంతా పరీక్ష చేయించుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మెట్రోసెమ్ సంస్థ ఆధ్వర్యంలో మొహతాజ్ ఖానాలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం టీబీ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాథమిక దశలోనే టీబీని గుర్తించి మందులు వాడితే సులభంగా నయమవుతుందని సూచించారు. అనంతరం ఆరోగ్య మహిళా కార్యక్రమ అమలు గురించి వైద్యులను అడిగి తెలుసుకుని, రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్, ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ సాజీద పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వడ్డీ మాఫీ పథకం అంతటా అమలు చేయాలి

- సామాన్య ఇంటి యజమానులపై బెదిరింపు వసూళ్లు మానుకోవాలి
- బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, మార్చి 18 : రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆస్తి పన్నులో వడ్డీ మాఫీ పథకం తీసుకురావాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ డిమాండ్ చేశారు. నగరంలో సామాన్య, మధ్య తరగతి ఇంటి యజమానుల నుంచి బెదిరింపు వసూళ్లు మానుకోవాలన్నారు. మంగళవారం స్థానిక 37వ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరానికి జీహెచ్ఎంసీ పరిధిలోని ఇళ్లకు మాత్రమే వడ్డీ మాఫీ పథకాన్ని ప్రకటించిందని పేర్కొన్నారు. మిగిలిన మున్సిపాలిటీలు కార్పొరేషన్‌లో కూడా ఈ పథకాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో మధ్యతరగతి సామాన్య ప్రజలు ఇంటి పన్నులు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వడ్డీ మాఫీ పథకాన్ని ప్రకటించాలని కోరారు. నగరంలో సామాన్యులు మధ్యతరగతి ఇంటి యజమానులపై ఒత్తిడి తీసుకొచ్చి ఇంటి పన్నులు వసూలు చేస్తున్న నగరపాలక అధికారులు లక్షల్లో బకాయిలు ఉన్న ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఎందుకు వసూలు చేయడం లేదని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఆస్తి పన్నులను వసూలు చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పన్నులు చెల్లించాల్సి ఉన్న సామాన్య మధ్యతరగతి ఇంటి యజమానులపై వడ్డీ మాఫీ పథకం వచ్చేవరకు ఒత్తిడి తీసుకురావద్దని కోరారు. పకడ్బందీగా వసూలు చేసేందుకు ఆసక్తి చూపుతున్న అధికారులు ఆయా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. నగరంలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదని పారిశుధ్యం కూడా అంతంత మాత్రంగానే ఉందన్నారు. నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో శ్రద్ధ తీసుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల నుంచి మాత్రం బెదిరింపులకు గురి చేసి పన్నులు వసూలు చేస్తున్నదని విమర్శించారు. వేసవి కాలం ప్రారంభానికి ముందే పలుకాలనీల్లో రోజు తప్పించి రోజు నీటి సరఫరా జరుగుతున్నదని, రానున్న రోజుల్లో సమస్య మరింత జటిలమయ్యే ఆస్కారం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నగరంలో సమస్యలను ఏ రోజూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అసలు ఇన్‌చార్జి మంత్రి ఉన్నడో లేడో అన్నట్లుగా పరిస్థితి ఉందని విమర్శించారు. ఇంటి పన్నుల కోసం సామాన్య, మధ్య తరగతి ప్రజలపై ఒత్తిడి తీసుకువస్తున్న నగరపాలక అధికారులు, వ్యాపార, వాణిజ్య సంస్థల నుంచి, ప్రభుత్వ కార్యాలయాల నుంచి పన్నులు వసూలు చేసి నగరాభివృద్ధి కోసం వ్యయంచేయాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బోనకుర్తి సాయికృష్ణ, చందు, ఆరె రవి గౌడ్, నాగుల కిరణ్, చేతి చంద్రశేఖర్, జెల్లోజి శ్రీనివాస్, గుండెల్లి రాజకుమార్, ఒడ్నాల రాజు, సత్తినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపిక

కుమార్

చొప్పదండి, మార్చి18: పట్టణానికి చెందిన మంచికట్ల కుమార్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ – 2 ఉద్యోగానికి ఎంపిక య్యాడు. కుమార్ తండ్రి మంచికట్ల విట్టల్ చొప్పదండి పట్టణంలో ఫుట్‌వేర్ షాప్ నడిపిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ, తన తండ్రి ఆశయాలను వమ్ము చేయకుండా కృషి, పట్టుదలతో చదివానని పేర్కొన్నాడు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపికైన కుమార్‌ను పద్మశాలీ సంఘం అధ్యక్షుడు దండే రాజయ్య, దండే లింగన్న, దూస రాము అభినందించారు.

BEFORE THE HON'BLE CHIT ARBITRATOR/DEPUTY REGISTRAR OF CHITS/ DISTRICT REGISTRAR AT KARIMNAGAR
A.R.B. No. 30 of 2022

Between;
M/s MANDIRA CHIT FUNDS PRIVATE LIMITED.,
H.No. 13-78, 2 Floor, Warangal Road, Huzurabad, Opp: HDFC Bank, Huzurabad, Branch, Represents by its Branch Foremar's Sri N.Ganesh S/o. Ankoos Age: (32) years. Occupation: Foremen of above chit fund......
...DISPUTANT

KANDHI RAVINDER REDDY & Others
...Dispatant

1. KANDHI RAVINDER REDDY S/o. SAMBASHIVA REDDY Age: 34 yrs. Occ: Business, R/o.H.No.688/31/1, Vill: Jagiripally. Mdi. Saidpoor, Dist: Karimnagar. (TS)
2. ABBIDI NARSIMIIA REDDY S/o. MALLA REDDY Age: 37 yrs, Occ: Business, R/o.H.No. 3-37, Vill: Vennampally Mdl: Saidapoor, Dist: Karimnagar. (TS)
3. KOMPELLI MAHIPAL REDDY S/o. MALLA REDDY Age: 52 yrs, Occ: Husiness, R/o.H.No.6-12, Vill. Vennampely, Mdl: Saidapoor, Dist: Karimnagar (TS)
4. PAIDAKULA KOMURAIAH S/o. RANGAIAH Age: 52 yrs, Occ: School Assistant, R/o. H.No.3-10, Vill: Raikal, Mdl: Saidapoor, Dist: Karimnagar. (T.S)
5. MOHMMED RAJU S/o. BASHUMIYA Age: 50 yrs. Occ: Business, R/o.H.No.11-108, Vivekananda Nagar, Vill & Md: Huzurabad, Dist: Karimnagar. (T.S)
6. ALETI ANIL KUMAR S/o. MAHENDER REDDY Age: 42 yrs, Occ: Business, R/o.H.No.4-3/3, Vill: Bornapally, Mdl; Huzurabod, Diat: Karimnagar. (T.S)
7. ABBIDI INDRA SENAREDDY S/o. NARSIMHA REDDY Age: 17 yrs. Occ: Business, R/o.H.No.3-37. Vill: Vennampally, Mdi: Saidapoor, Dist: Karimnagar, (TS)
...Opponent

Take notice that the above dispute is filed against you and others for recovery of money several times notice were issued to you. But your have failed to receive the sume. The above dispute is posted on **27 MAR 2025** For Your apperance. On that day you have to appear in person at 11.00 A,M. Before the Deputy registras referred above. Other wise the case will be decided ex-porte

Sd/- DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR KARIMNAGAR

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం హర్షణీయం

గంగాధర, మార్చి 18: శాసన సభలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడం హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మాదిగల ఆర్థిక స్థితిగతులపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడిగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు ప్రకటించారని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం న్యాయమైన ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ పార్టీ మొదటి నుండి మద్దతు పలుకుతున్నదని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి 2014లోనే ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసిందని గుర్తు చేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై నాన్చివేత ధోరణిని నిరసిస్తూ బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో కేంద్రాన్ని ప్రశ్నించారని పేర్కొన్నారు. 2004 నుంచి పదేళ్లు అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అవసరమైన రాజ్యాంగ సవరణ చేయడానికి కుంటి సాకులు చెప్పిందని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ పూర్తయితే ప్రభుత్వ ఉద్యోగాల్లో, రాజకీయాల్లో అవకాశాలు పెరుగుతాయని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కొత్తపల్లి పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ

కొత్తపల్లి, మార్చి 18: కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సీపీ గౌష్ ఆలం తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. త్వరగా వాటిని పూర్తి చేయాలని సూచించారు. నమోదైన సైబర్ నేరాల గురించి తెలుసుకున్నారు. అర్బన్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు పోలీసు అధికారులను కేటాయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కొత్తపల్లి పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ, ప్రొబెషనరీ ఐపీఎస్ వసుంధర ఫౌరెబి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీని కలిసిన మున్సిపల్ కమిషనర్

కార్పొరేషన్, మార్చి 18: కరీంనగర్ సీపీ గౌష్ ఆలంను మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మంగళవారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఆయన కార్యాలయంలో కలిశారు. పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోలీస్ శాఖ ప్రాపర్టీ ట్యాక్స్ వివరాలను సీపీకి అందించారు. కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ ట్యాక్స్‌ను చెల్లించేలా చూడాలని కోరారు.

సీపీకి టీఎన్జీవో, టీజీవో నాయకుల శుభాకాంక్షలు

కొత్తపల్లి, మార్చి 18 : కరీంనగర్ సీపీగా ఇటీవల బాధ్యతలు తీసుకున్న గౌష్ ఆలంను జిల్లా టీఎన్జీవో, టీజీవో నాయకులు మంగళవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, టీజీవో జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళిచరణ్ కార్యవర్గ సభ్యులను సీపీకి పరిచయం చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో, టీజీవో నాయకులు సంగెం లక్ష్మణరావు, ఎడ్ల రవీందర్‌రెడ్డి, రాంమోహన్, నాగరాజు, ముప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి, గూడ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్ విజేత మెదక్

హుజూరాబాద్ టౌన్, మార్చి 18: పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో సీనియర్ హాకీ క్రీడాకారుడు మోటపోతుల రమేశ్ జ్ఞాపకార్థం మూడు రోజులుగా జరుగుతున్న 8వ రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ హాకీ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఫైనల్‌లో మెదక్, నిజామాబాద్ జట్లు తలపడగా మెదక్ జట్టు 4–1తేడాతో విజయం సాధించింది. నిజామాబాద్ జట్టు రన్నరప్‌గా నిలువగా, హైదరాబాద్, కరీంనగర్ జట్లు మూడు, నాలుగు స్థానాలను దక్కించుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్, హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

గ్రామంలో ప్రశాంత వాతావరణానికి సహకరించాలి

శంకరపట్నం, మార్చి 18: గ్రామంలో శాంతియుత వాతావరణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్ కోరారు. మండలంలోని ముత్తారం గ్రామంలో ఇటీవల ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన విషయంలో ఇరు వర్గాల మధ్య వివాదం తలెత్తగా, మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో కృష్ణప్రసాద్, తహసీల్దార్ భాస్కర్, ఎస్ఐ రవి ఇరువర్గాల యువకులను పిలిపించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్ చట్టాలపై అవగాహన కల్పించారు. ముత్తారం గ్రామంలో ఉద్రిక్తత తగ్గి, శాంతియుత వాతావరణం నెలకొనేలా ఇరువర్గాలు సామరస్య వాతావరణంలో కూర్చుని చర్చించుకోవాలని కోరారు.

వర్గీకరణ బిల్లు ఆమోదంపై సంబురాలు

శంకరపట్నం, మార్చి 18: ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడంపై మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కనుకుంట్ల శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు భూమయ్య, రవి, తిరుపతి, సమ్మయ్య, శంకర్, శ్రీనివాస్, భిక్షపతి, చక్రపాణి, సుధాకర్, రాజమల్లు, సంపత్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

నలుగురిపై మాల్ ప్రాక్టీస్ కేసు

కమాన్‌చౌరస్తా, మార్చి 18 : జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు జరుగగా, మొత్తం 15,965 మంది విద్యార్థులకు 15,563 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పలు పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించగా, జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో పరీక్షకు హాజరైన ఒకరు, అల్ఫోర్స్ వావిలాలపల్లి కళాశాల పరీక్ష కేంద్రంలో ముగ్గురు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడినట్లు వివరించారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి


ప్రజ్ఞాన్

సైదాపూర్, మార్చి18: బొమ్మకల్ గ్రామంలో నీటిసంపులో పడి బాలుడు మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎలబోయిన చైతన్య–సురేశ్ దంపతుల కుమారుడు ప్రజ్ఞాన్ (2) మంగళవారం ఇంటి వద్ద ఆడుకుంటూ, అక్కడే ఉన్న నీటిసంపులో ప్రమాదవశాత్తు పడిపోయాడు. కుటుంబసభ్యులు కొద్దిసేపటికి చూడగా నీటి సంపులో ఉన్నాడు. బంధువులు బాలుడిని చికిత్స కోసం హుజూరాబాద్‌కు తరలించగా అప్పటికే మృతిచెందాడు. కాగా, ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో బాలుడి తల్లిదండ్రులు బోరున విలపించారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

వృద్ధురాలి హత్య కేసులో మనుమడు అరెస్టు

కొత్తపల్లి, మార్చి 18 : కొత్తపల్లి గ్రామ శివారులో ఈనెల 15న హత్యకు గురైన వృద్ధురాలి కేసులో నిందితుడిని సోమవారం రాత్రి అరెస్టు చేశారు. కొత్తపల్లి స్టేషన్ హౌస్ ఆఫీసర్, ప్రొబెషనరీ ఐపీఎస్ అధికారిని వసుంధర యాదవ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌కు చెందిన తనుకు వెంకటమ్మ (70) తనకు మగ పిల్లలు లేకపోవడంతో బిడ్డ కొడుకు తనుకు చంద్రశేఖర్‌ను దత్తత తీసుకుంది. నాలుగేళ్ల క్రితం అతడికి వివాహం జరిపించింది. అయితే, వెంకటమ్మ వద్ద ఉన్న బంగారం, డబ్బులు ఆడబిడ్డలకే ఇస్తోందని, తనకు అన్యాయం చేస్తున్నదంటూ చంద్రశేఖర్ తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో ఏడాది కాలంగా భార్యతో కలిసి కరీంనగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. ఇటీవల వెంకటమ్మ కోహెడ మండలం రామచంద్రపూర్‌లో ఉన్న బంధువుల వద్దకు వెళ్లి ఉంటోంది. ఈ నెల 15న ఎల్ఐసీ డబ్బులు వచ్చాయని, కరీంనగర్‌కు రావాలని చంద్రశేఖర్ వృద్ధురాలికి తెలిపాడు. దీంతో బంధువులు ఆమెను కరీంనగర్‌కు బస్సు ఎక్కించగా, దిగగానే జగిత్యాలకు వెళ్లి డబ్బులు తీసుకురావాల్సి ఉన్నట్టు చెప్పి ఆమెను చంద్రశేఖర్ కారులో ఎక్కించుకొని వెళ్లాడు. అక్కడ అధికారులు అందుబాటులో లేరని చెప్పి సాయంత్రం తిరుగు పయనయ్యారు. అనుకున్న పథకం ప్రకారం కొత్తపల్లి శివారు ఎస్సారెస్పీ కెనాల్ వద్దకు చేరుకోగానే మూత్ర విసర్జన కోసమంటూ కారును ఆపి, తను దిగి ఆమెను కూడా దిగుమని చెప్పాడు. విసర్జన చేస్తున్నట్లు నటించి వెనుక నుంచి వచ్చి వృద్ధురాలి మెడభాగంలో కత్తితో నరికాడు. ఆ తర్వాత గదువ భాగంలో కూడా కత్తితో నరికాడు. ఘటనలో ఆమెకు తీవ్ర రక్తస్రావం జరిగి మృతి చెందింది. హత్య చేసిన అనంతరం చంద్రశేఖర్ కారును తన స్నేహితుడికి అప్పగించి వరంగల్‌కు పయనమయ్యాడు. రెండు రోజులుగా పోలీసులు గాలించి 17న రాత్రి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

పార్కు నిర్వహణపై కమిషనర్ అసంతృప్తి

కార్పొరేషన్, మార్చి 18: కరీంనగర్‌లోని జ్యోతిబా పూలే పార్కును మంగళవారం కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ సందర్శించారు. అనుమతి లేకుండా పార్కులో స్టాల్స్ ఏర్పాటు చేయడం, పార్కు నిర్వహణ సరిగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్ స్పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. లక్ష్యం మేరకు పన్నులు వసూలు పూర్తి చేయాలని ఆదేశించారు.

టౌన్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీకి పదోన్నతి

కొత్తపల్లి, మార్చి 18: కరీంనగర్ టౌన్ టాస్క్ ఫోర్స్ ఏసీపీగా పని చేస్తున్న నరేందర్‌కు అడిషనల్ ఎస్పీ (ఎన్‌సీ) గా పదోన్నతి లభించింది. పోస్టింగ్ కోసం డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

భార్యను కాపురానికి పంపాలని అర్ధనగ్న నిరసన

హుజూరాబాద్ టౌన్, మార్చి 18 : తన భార్య తన ఇంటికి వచ్చేలా చూడాలని పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఘర్షనగర్‌కు చెందిన గుంజె రాజు అనే వ్యక్తి పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డుపై అర్ధనగ్నంగా బైఠాయించి మంగళవారం నిరసన తెలిపాడు. హుజూరాబాద్‌కు చెందిన తన అత్తమామలు సంపంగి దుర్గయ్య, నీలమ్మ తన భార్యను ఇంటికి పంపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులు ఎంత సముదాయించినా రాజు వినకపోవడంతో బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించి, కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

గంగాధర, మార్చి 18 : దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసిన తర్వాతే ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు చిలుములు రాజయ్య డిమాండ్ చేశారు. మాదిగ, మాదిగ ఉపకులాల ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టవద్దని ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన దీక్షలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. వెంటనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకుడు తడగొండ శంకర్, గంగాధర రవి, దోమకొండ శ్రీనివాస్, గంగాధర రఘు, ద్యావ శ్రీనివాస్, దోమకొండ అనిల్, దోమకొండ నరేశ్, గంగాధర వేణు, గంగాధర శంకర్, బెజ్జంకి ఇసాక్, కల్లెపెల్లి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్లుకు ఘన నివాళి

కరీంనగర్ రూరల్/విద్యానగర్, మార్చి 18: కరీంనగర్ బైపాస్‌లోని జిల్లా మున్నూరు కాపు సంఘం సంక్షేమ భవన్‌లో మంగళవారం ఇందుర్తి మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకన్న వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి మున్నూరుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్, కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, బొమ్మ వెంకటేశ్వర్లు ట్రస్ట్ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నలువాల రవీందర్, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్, బండారి వేణు, కళ్యాడపు ఆగయ్య, నలువాల రాజేందర్, ట్రస్ట్ సభ్యుల, మున్నూరు కాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రసాభాసగా వారసంత వేలం

గంగాధర, మార్చి 18 : గంగాధర గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వారసంత వేలం రసాభాసగా మారింది. వారసంత వేలాన్ని ప్రారంభించగానే గ్రామస్తులు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. నిబంధనల ప్రకారం వారసంత వేలం నిర్వహించడం లేదని, సమయం మించిపోయిన తర్వాత వచ్చిన వారి నుంచి డీడీలు స్వీకరించారని గ్రామస్తులు ఆరోపించారు. గతంలో వేలంలో వారసంతను దక్కించుకున్న వారు ఏడాది గడిచినా కూడా పూర్తి డబ్బులు చెల్లించకున్నా తిరిగి వేలంలో పాల్గొనడానికి అవకాశం ఇచ్చారని అసంతృప్తిని వ్యక్తం చేశారు. వారసంత ద్వారా గ్రామ పంచాయతీకి ఏడాదికి కోటిన్నర వరకు ఆదాయం వస్తున్నా గ్రామాభివృద్ధి జరుగడం లేదని, కనీసం పారిశుధ్య నిర్వహణను సక్రమంగా అమలు చేయడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గ్రామస్తులతో మాట్లాడిన గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్దన్‌రెడ్డి వారసంత వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

పీఎం ప్రణమ్ పథకంపై అవగాహన

మానకొండూర్ రూరల్, మార్చి 18 : గంగిపల్లిలో ధనలక్ష్మి ధాన్య విత్తన సహకారం సంఘం, ఐపీఎల్ కంపెనీల ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు పీఎం ప్రణమ్ పథకంపై అవగాహన కల్పించారు. దీనికి జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి హాజరై మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ ఎరువుల వాడకాన్ని గురించి వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ అధికారి శ్రీధర్, ఏవో శ్రీనివాస్ రెడ్డి, ధనలక్ష్మి ధాన్య విత్తన సహకార సంఘం అధ్యక్షుడు పారిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఐపీఎల్ రాష్ట్ర మేనేజర్ జాఫర్ మక్బూల్, జిల్లా మేనేజర్ నిఖిల్ మేరుగు, అగ్రనామిస్ట్ కృష్ణ ప్రణీత్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో వివక్ష వీడాలి

కలెక్టరేట్, మార్చి 18 : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వివక్ష విడనాడి పారదర్శకత పాటిస్తే, అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని తెలంగాణ మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇంతియాజ్ అన్నారు. మంగళవారం నగరంలోని ముకరంపురలో గల ఆసంఘం జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాస పథకంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన యువజనులకు సముచిత ప్రాధాన్యత కల్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కాశబోయిన మహేందర్, సంఘం ప్రతినిధులు ఏసోబు, బి.భాస్కర్ కుమార్, అడ్వకేట్ ఓంప్రసాద్, కనపర్తి శ్రీనివాస్, మనోహరస్వామి, మాదిరెడ్డి ప్రభాకర్, కెంచ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ రూరల్, మార్చి 18: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గురుకులాల్లో 6,7,8,9వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహాత్మాజ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకులాల సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

సమస్యలు పరిష్కరించేదాకా ఉద్యమం

విద్యానగర్, మార్చి 18: కరీంనగర్‌లోని ప్రధాన ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించేదాకా ఉద్యమిస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు యు.శ్రీనివాస్, గుడికందుల సత్యం స్పష్టం చేశారు. మంగళవారం దవాఖానలో పనిచేస్తున్న 300 మంది కార్మికులు సీఐటీయూలో చేరగా, వారు కండువా కప్పి ఆహ్వానించారు. ఇప్పటికైనా డీఎంహెచ్‌వో, సూపరింటెండెంట్ దృష్టి సారించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్మికులను వేధిస్తున్న యాజమాన్య టెండర్లను రద్దు చేసి బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

'బిల్లులు చెల్లించకుంటే భవనాలకు తాళం వేస్తాం'


కేశవపట్నం జీపీ ఎదుట తాము చేసిన అభివృద్ధి పనుల వివరాలను ప్రదర్శిస్తున్న మాజీ సర్పంచ్ సమ్మయ్య

శంకరపట్నం, మార్చి 18 : తాము అప్పులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడితే ప్రభుత్వం తమకు రావాల్సిన బిల్లులు చెల్లించడం లేదని, చెల్లించకుంటే తాము నిర్మించిన భవనాలకు తాళం వేస్తామని కేశవపట్నం మాజీ సర్పంచ్ దంపతులు మోత్కూరి సమ్మయ్య–రమాదేవి స్పష్టం చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. కొంత కాలంగా గ్రామాల్లో తాము చేసిన పనుల బిల్లులు రావడం లేదని కలెక్టరేట్, అసెంబ్లీ ముట్టడి వంటి కార్యక్రమాలు చేపడితే ముందస్తుగా అరెస్టులు చేసి భగ్నం చేసినట్లు తెలిపారు. తమకు రావాల్సిన బిల్లులను ప్రభుత్వం ఇప్పటికైనా చెల్లించాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలలో జాతీయ స్థాయి సెమినార్ ప్రారంభం

జమ్మికుంట, మార్చి18: జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో తెలుగు, ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బీ రమేశ్ అధ్యక్షతన 'భారతీయ సాహిత్యంలో పర్యావరణ పరికల్పన' అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి సెమినార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సెమినార్‌కు పలు జిల్లాల నుంచి 82మంది ప్రొఫెసర్లు, అధ్యాపకులు హాజరయ్యారు. సెమినార్ అంశంపై వారి పత్రాలను సమర్పించారు. అనంతరం సావనీర్ పుస్తకాలను ఆవిష్కరించారు. తొలి రోజు జరిగిన సెమినార్‌కు ముఖ్య అతిథిగా ఎస్సారార్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణ హాజరై మాట్లాడుతూ.. ప్రకృతిని ఆరాధించే గొప్ప సంస్కృతి మనదని, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు అందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. వరంగల్ నిట్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ ఎం రాజావిశ్వనాథం, హుజూరాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, తదితరులు మాట్లాడారు.

20, 21 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు

కమాన్‌చౌరస్తా, మార్చి 18 : ఈ నెల 20, 21 తేదీల్లో వికసిత్ భారత్ – యూత్ పార్లమెంట్ డిస్ట్రిక్ట్ లెవెల్ నోడల్ కళాశాల రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ తెలిపారు. ప్రారంభోత్సవానికి సీపీ గౌష్ ఆలం, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కి ఆయన ఆహ్వానం అందజేశారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తాం

తెలంగాణచౌక్, మార్చి18: ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తామని డిపో–2 మేనేజర్ మల్లయ్య పేర్కొన్నారు. నగరంలోని డిపో కార్యాలయంలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల ప్రయాణికుల నుంచి ఫోన్ ద్వారా సలహాలు, ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ అందిస్తున్న సేవలు వివరించారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాజీ మేయర్ సునీల్‌రావుకు సన్మానం

కరీంనగర్ రూరల్, మార్చి 18: కరీంనగర్ నగర పాలక సంస్థ మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావును పద్మనాయక వెలమ సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఐదు సంవత్సరాల పదవీ కాలంలో కరీంనగర్ నగరాభివృద్ధి ఎంతో కృషి చేశారని కొనియాడుతూ, ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో కరీంనగర్ పద్మనాయక వెలమ సంఘం జాయింట్ కార్యదర్శి బోయినపల్లి భూపతిరావు, కార్యవర్గ సభ్యులు వాల శంకర్‌రావు, సుంకిశాల సంపత్‌రావు, జూపల్లి మాధవరావు, జోగినిపల్లి రాజగోపాల్‌రావు, పల్లెపాటి వేణుగోపాల్‌రావు, అయిల్నేని సుధాకర్‌రావు, తాండ్ర అశోక్‌రావు, గండ్ర మంజుల పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ నిర్మాణ పనులపై విచారణ జరిపించాలి

తెలంగాణచౌక్, మార్చి 18: నగర పాలక సంస్థ చేపట్టిన స్మార్ట్ సిటీ పనుల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో మంగళవారం నిర్వహించిన నగర శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కోట్లాది రూపాయల అవతకవకలు స్మార్ట్ సిటీ పనుల్లో చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ప్రజల సొమ్ము దుర్వినియోగంపై విచారణ జరిపించి, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు మల్లమ్మ, సదానందం, రాయమల్లు, సంతోష్‌చారి, సదయ్య పాల్గొన్నారు.

జేఏసీ ఇన్‌చార్జిగా బూర్ల మొగిలి

శంకరపట్నం, మార్చి 18: తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వంకాయగూడెం గ్రామానికి చెందిన బూర్ల మొగిలి నియామకమయ్యారు. ఈ మేరకు జేఏసీ జిల్లా చైర్మన్ సుల్తాన్ యాదగిరి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమంలో తనదైన పాత్ర పోషించిన మొగిలిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రఫుల్ రాంరెడ్డి, రాష్ట్ర వైస్ చైర్‌పర్సన్ బోగ పద్మ ఆదేశాల మేరకు ఇన్‌చార్జిగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఘనంగా వార్షిక సమావేశం

విద్యానగర్, మార్చి 18: భారత్ సంచార్ నిగం లిమిటెడ్ సంస్థలో గుర్తింపు గల యూనియన్ ఎన్ఎఫ్‌టీఈ బీఎస్ఎన్ఎల్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా 9వ వార్షిక సమావేశం శ్రీరామరెడ్డి అధ్యక్షతన స్థానిక ఫిలీం భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యూనియన్ జాతీయ నాయకులు రాజమౌళి, ఉమ్మడి కరీంనగర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పొన్నం అజయ్ కుమార్ హాజరయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
★ Yella Ganga S/o Gangaram (Old Name) H.No. 8-51/7/8/1, Rudrangi village & mandal, Rajanna Sircilla Dist. my Name was changed to Yella Gangaram s/o Gangaram (New Name)
NTK-00000

CHANGE OF NAME
Nagasani Lasya W/o Nagasani Harish @ Nagasani Akhila W/o Nagasani Harish.. both names are me. H.No. 3-28, v/o Laxmipur, Thangallapally mandal, Rajanna Siricilla Dist. Telangana. Record of all purpose the affidavit dated by 18-03-2025 swron before notary K. Rajesham Rajannasircilla.

డాక్యుమెంట్ పోయినది
★ రావణవేని రాజేందర్, S/o. రాజమల్లు, R/o. H.No. 1-14/1, గ్రా॥ ఆసీఫ్‌నగర్, మం॥ కొత్తపెల్లి (H), జిల్లా॥ కరీంనగర్. నేను ఆసీఫ్‌నగర్ నుండి కరీంనగర్ వస్తుండగా ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 1828/2015 గలది పోయినది. దొరికిన వారు సంప్ర॥ సెల్: 99899 15378.
NTK-00000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

ఓపెన్ టెండర్
జమ్మికుంట మండలంలోని శంభునిపల్లి గ్రామ పంచాయితీలో ప్రతి శనివారము నిర్వహించే గొర్రెలు, మేకల సంత కోసం టెండరులో పాల్గొనేందుకు ఆసక్తి కలవారు. తేది: 22-03-2025 శనివారం రోజున సాయంత్రం 4: 00 గంటల లోపు పంచాయతీ కార్యదర్శి శంభునిపల్లి పేరున రూ॥ 20,000/- డి.డి.ని. గ్రామ పంచాయితిలో అందజేసి తేది: 25-03-2025 రోజున ఉదయం 11:00 గం॥లకు మంగళవారం రోజున జరిగే వేలంలో పాల్గొనగలరు.
సం/- పంచాయతి కార్యదర్శి, గ్రా.పం.శంబునిపల్లి సెల్ : 9963194184
సం/- ప్రత్యేక అధికారి, గ్రా.పం.శంబునిపల్లి సెల్ : 8121448144